సాక్షి
చిత్తూరు
సోమవారం । 11 । మార్చి । 2024



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్, మంత్రి విడదల రజిని, లక్ష్మీపార్వతి, బాలినేని, మోపిదేవి, బీద మస్తాన్‌రావు తదితరులు





బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు పోటెత్తిన జనసందోహంలో ఓ భాగం (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జయ జయ జయహో..

సిద్ధం సభ జన సంద్రం

సైన్యంలా...ఓ శాసనంలా
ఊళ్లన్నీ ఒక్కటిగా.. జనమంతా ఐక్యంగా
జన చేతన పొంగిన సంద్రంలా
కొత్త ఒరవడికి శ్రీకారంలా...
భూదేవి నుదుట దిద్దిన సిందూరంలా
మహోజ్వల ఘట్టానికి మలి మెట్టులా
సువర్ణ అధ్యాయానికి జన సంతకంలా
చరిత్ర పుటల్లో తమకంటూ ఓ పేజీలా
సమరోత్సాహంతో...సమధికోత్సాహంతో...
కదనరంగానికి దుమికినట్టు..
కార్యోన్ముఖులై కదిలినట్టు
జన సారథి వెంట జనవారధి కట్టినట్టు
రాజన్న బిడ్డ పాలన మళ్లీ రావాలంటూ
అభివృద్ధే లక్ష్యంగా.. సంక్షేమమే సాక్ష్యంగా
గడప గడప నుంచి.. పల్లె పల్లె నుంచి
జన సమూహాలు జన సందోహాలు
సిద్ధం సభకు తరలి వచ్చిన తీరు
మరో మహోద్యమాన్ని తలపించింది..
రేపటి భవితను సాక్షాత్కరించింది.



మా నమ్మకం నువ్వే అన్నా: సిద్ధం పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న యువత



కెవ్వు కేక : సమరానికి సిద్ధమంటూ విజిలేస్తున్న మహిళ



ఓ అన్నా.. నీవెంటే మేమంటూ నినదిస్తున్న యువతి

- అన్నిదారులూ బాపట్ల జిల్లా మేదరమెట్ల వైపే..
- ఉదయం నుంచే సభాస్థలికి తరలివచ్చిన జనసందోహం
- లక్షలాదిగా కదిలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు
- జనసంద్రంగా మారిన సభా ప్రాంగణం
- వందలాది ఎకరాలతోపాటు స్తంభించిన జాతీయ రహదారి
- సీఎం వైఎస్ జగన్ ప్రసంగంతో ఆద్యంతం హోరెత్తిన జనస్పందన
- నిన్ను మళ్లీ గెలిపించుకునేందుకు సిద్ధం అంటూ నినదించిన జనం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం జరిగిన సిద్ధం సభ జనంతో పోటెత్తింది. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో నిర్వహించిన ఈ సభకు ఆయా జిల్లాలనుంచి జనం లక్షలాదిగా తరలివచ్చారు. మధ్యాహ్నం తరువాత సభ జరగాల్సి ఉన్నా ఉదయం 9 గంటలనుంచే జనం సభా ప్రారంభానికి చేరుకోవడం ప్రారంభమైంది. 11 గంటల ప్రాంతానికి మేదరమెట్ల సమీపంలోని జాతీయ రహదారివద్ద వందలాది ఎకరాల్లో సిద్ధం చేసిన సిద్ధం సభా ప్రాంగణం జనంతో నిండి పోయింది. సమీపంలోని పొలాలతోపాటు పక్కనే ఉన్న చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి సైతం సభకు వచ్చిన జనంతో కనుచూపుమేర జనసంద్రంగా మారింది. ఈ రహదారిలో మేదరమెట్ల నుంచి రేణంగివరం వరకు 18 కిలోమీటర్ల వరకు రోడ్డు జనంతో కిక్కిరిసి పోయింది. మరోవైపు మేదరమెట్ల నుంచి అద్దంకి వరకు (హైదరాబాద్) ప్రధాన రహదారి జనసంద్రంగా మారింది. పిల్లలు, యువత, మధ్యవయస్కులు, వృద్ధులు, మహిళలు అన్నతేడా లేకుండా అన్నివర్గాలవారు వైఎస్సార్ సీపీ జెండాలు చేబూని సభకు తరలివచ్చారు. రాష్ట్రం నలుమూలలకు వినిపించేలా జై జగన్ అన్న సభికుల నినాదాలు సభలో హోరెత్తించాయి.



ప్రజల మధ్యకు వచ్చి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

రెండు సార్లు బటన్ నొక్కేందుకు సిద్ధం..

58 నెలల్లో మీ బిడ్డ మీ కోసం 130 సార్లు బటన్‌నొక్కి రూ. 2.70 లక్షల కోట్లు మీ ఖాతాల్లో వేశానని, నా కోసం మీరు రెండు బటన్లు నొక్కలేరా అనగానే నొక్కుతాం...నొక్కుతాం అంటూ పెద్ద ఎత్తున ప్రతిధ్వనించారు. మీ బిడ్డకు ఓటేస్తే అన్ని పథకాలు అందుతాయని, బాబుకు ఓటేస్తే చంద్రముఖిని మనమే వెళ్లి నిద్రలేపి ఇంటికి తెచ్చుకున్నట్లేనని జగన్ అనడంతో అవును... అవును...అంటూ ప్రజలు స్పందించారు. 2019 మించి 175 కు 175 ఎమ్మెల్యేలు, 25 కు 25 ఎంపీలు గెలవడానికి మనమంతా సిద్ధమేనా అనగానే సిద్ధం..సిద్ధం అంటూ జనం హోరెత్తించారు. త్వరలోనే మేనిఫెస్టో ప్రకటిస్తానని, జగన్ మాట ఇచ్చాడంటే తగ్గేదేలే అంటూ అనగానే జనం ఈలలు, కేకలతో సభ దద్దరిల్లింది. మళ్లీ నిన్నే గెలిపించుకుంటామంటూ ప్రతిస్పందించారు. ప్రతిపక్షాలపై విమర్శలు బాణాలు సంధించినప్పుడు జనంలో ఉత్సాహంతో కూడిన ప్రతిస్పందన కనిపించింది. ఈ ఎన్నికల్లో వారి అంతు తేలుస్తామంటూ జనం ఆగ్రహంతో ఊగిపోయారు. కుట్రలు, కుతంత్రాలకు ముగింపు పలుకుతామంటూ నినదించారు. సభ ఆద్యంతం సీఎం...సీఎం అంటూ హోరెత్తించారు.ఈ సభలో మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, మేరుగ నాగార్జున, ఎంపీలు విజయసాయి రెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు, కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు బాలినేని శ్రీనివాసరెడ్డి, కరణం బలరాం కృష్ణమూర్తి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కోన రఘుపతి, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, నియోజకవర్గ సమన్వయకర్తలు పానెం చిన హనిమిరెడ్డి, కరణం వెంకటేష్, యడం బాలాజీ, ఈవూరి గణేష్, వరికూటి అశోక్, వైవీ భద్రా రెడ్డి పాల్గొన్నారు.





ర్యాంపు వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఆయుధాలు ప్రయోగించాల్సిన సమయం ఆసన్నం..

ఈ యుద్ధంలో మీది శ్రీకృష్ణుడి పాత్ర, నాది అర్జునుడి పాత్ర, దుష్టులపై ఆయుధాలు ప్రయోగించాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకే జమ్మిచెట్టుపై నుంచి ఆయుధాలు దింపాల్సిన సమయం ఆసన్నమైందంటూ జగన్ భారతాన్ని ఉటంకించడంతో జనం కేరింతలు కొట్టారు. చంద్రబాబు లాగా మనకు 10 మంది నటించే పొలిటికల్ యాక్టర్లు లేరు....రకరకాల పార్టీలతో పొత్తులు లేవు. అందుకే ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తున్నాను. మీ బిడ్డకు మీరే స్టార్ క్యాంపెయినర్లు. ప్రతిపక్ష పార్టీలో సైన్యాధిపతులు తప్ప సైన్యం లేదని 5 కోట్ల మంది సైన్యం అండదండలతో మనం సిద్ధం అని ముఖ్యమంత్రి అనగానే జనం ఈలలు, కేకలతో స్పందించారు. చంద్రబాబుకు దోచుకునేందుకు, దాచుకునేందుకే అధికారం కావాలని జగన్ అనడంతో జనం అవును...అవును అంటూ నినదించారు.



నేను సైతం..

అపూర్వ స్పందన..

సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు చేరుకున్నారు. తర్వాత సభావేదిక మీదకు చేరుకున్న ముఖ్యమంత్రి 4.47 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించి, 5.56 గంటలకు ప్రసంగాన్ని ముగించారు. ముఖ్యమంత్రి ప్రసంగం ఆద్యంతం సభికులను ఆకట్టుకుంది. ఆయన ప్రతిమాటా తూటాలా పేలింది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకోసం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ముఖ్యమంత్రి సూటిగా జనం ముందుంచారు. పథకాలతో జనానికి జరిగిన మేలును గణంకాల రూపంలో వివరించారు. ముఖ్యంగా పేదవర్గాల జీవన ప్రమాణాలు ఎలా మెరుగు పడ్డాయో తెలియ జెప్పారు. ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన నేత పవన్‌కల్యాణ్, రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న కుట్రలను ప్రజల ముందు బట్టబయలు చేశారు. ప్రతిపక్షాలపై జగన్ విరుచుకు పడటంతో జగన్ గొంతులో గొంతు కలిపి తమదైన శైలిలో మద్దతు పలికారు. మరో ఐదేళ్లు ఈ ప్రభుత్వం కొనసాగాలంటే మీరు మద్దతు పలికేందుకు సిద్ధమా.? అనడంతో సిద్ధం..సిద్ధం అంటూ జనం ఈలలు, కేకలతో స్పందించారు. 'జగన్ సీఎం...సీఎం ' అంటూ నినాదాలు చేశారు. పేదవాడి భవిష్యత్తు కాపాడేందుకు నాతో కలిసి రావడానికి మీరు సిద్ధమా...? అని సీఎం అనగానే సిద్ధం అంటూ జనం ప్రతిస్పందించారు. పార్టీలతో బాబు....ప్రజలతో మనం ఈ సంగ్రామానికి జనం సిద్ధమా... అనగానే సిద్ధం ...సిద్ధం అంటూ హోరెత్తించారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర సిద్ధం..., ఉత్తర కోస్తా సిద్ధం, రాయలసీమ సిద్ధం... తాజాగా దక్షిణ కోస్తా సిద్ధం అంటూ జగన్ అనగానే సిద్ధం...సిద్ధం అంటూ ప్రజలు ప్రతిధ్వనించారు.





సిద్ధం సభకు తరలివచ్చిన పల్లె ప్రజానీకం



సిద్ధం సభ వద్ద యువత కేరింత

క్లుప్తంగా

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నోటిఫికేషన్ విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నోటిఫికేషన్ విడుదలైందని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయశంకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 3 దశల్లో రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ఉంటుందన్నారు. విద్యార్హత, శారీరక/వైద్య ప్రమాణాల వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. యానిమేటెడ్ వీడియోల రిజిస్టర్, దరఖాస్తు, పరీక్షకు ఎలా హాజరు కావాలి ? అనే వివరాలు కూడా పొందుపరిచారన్నారు. సందేహాలు ఉంటే www.ojinindianarmy.nic.in (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాయిన్‌ఇండియన్‌ఆర్మీ.ఎన్‌ఐసీ.ఇన్) వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. అడ్మిట్ కార్డ్ కలర్ ప్రింట్‌తో పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందని సూచించారు.

గజరాజుల విధ్వంసం

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లె పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతానికి సరిహద్దులో ఉన్న గుట్టపాళెం గ్రామంలో వరిపంటలపై ఏనుగుల గుంపు పదేపదే చొరబడుతూ తీవ్ర నష్టం కలిగిస్తోంది. ఆదివారం వేకువజామున ఒంటరి ఏనుగు, నాలుగు ఏనుగులు ఉన్న ఓ గుంపు గుట్టపాళెం గ్రామానికి చెందిన శంకరయ్య, సురేష్, కార్తీక్, విజయ్‌కుమార్ రైతులకు చెందిన నాలుగు ఎకరాల్లో వరిపంటను తిని, తొక్కి ధ్వంసం చేశాయి. ఏనుగుల దాడులతో సుమారు రూ.70 వేల పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. సమాచారం అందుకున్న గుండ్లపల్లె ఫారెస్టు బీట్ అధికారి లావణ్య ఆదివారం ఒంటరి ఏనుగు, ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన వరి పంటలను పరిశీలించారు. ట్రాకర్ల సహాయంతో ఏనుగుల గుంపును సదుం మండలం చీకలచేను అడవిలోకి తరిమి వేశామని బీట్ అధికారి తెలిపారు.

ప్రత్యేక హోదా మాట మార్చారు

- ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే
- మోసాల మేనిఫెస్టోను నమ్మొద్దు
- కుప్పంలో చంద్రబాబుకు ఓటమి తప్పదు
- మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణస్వామి



శ్రీకృష్ణదేవరాయుల విగ్రహావిష్కరణలో మంత్రులు, ఎంపీ, జెడ్పీ చైర్మన్, చిత్తూరు ఇన్‌చార్జ్

చిత్తూరు రూరల్: జనసేన, బీజేపీ, టీడీపీ కలయికలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు.. పదేళ్లు.. 15 ఏళ్లు ఇస్తామని చెప్పి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, వెంకయ్యనాయుడు మాట మార్చారని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. చిత్తూరు నగరంలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయుల విగ్రహావిష్కరణ చేసి ఆయన మీడియాతో మాట్లాడారు. 2014లో మోదీ, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ప్రత్యేక హోదా విషయాన్ని అసలు పట్టించుకోలేదన్నారు. ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ మోదీపై అసభ్యకర వ్యాఖ్య లు చేసి, మళ్లీ వారితోనే చంద్రబాబు జతకడుతున్నాడన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో కాపులకు మేలు

చిత్తూరు రూరల్: వైఎస్సార్‌సీపీ పాలనలోనే కాపులకు మేలు జరిగిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని గంగినేని పార్కులో ఆదివారం వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణదేవరాయల విగ్రహావిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి, ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం పెద్దిరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి చిత్తూరును అభివృద్ధి చేసుకోవాలన్నారు. కాపు భవన నిర్మాణానికి రూ.50 లక్షలు విరాళంగా అందజేస్తానని తెలిపారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగనన్నే సీఎం అవుతారని స్పష్టం చేశారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వక్రబుద్ధి చూపించి అభివృద్ధిని అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వన్నియకుల క్షత్రియ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు విరాళంగా అందజేశారు. బలిజ సంఘం నాయకులు నందగోపాల్, రవినాయుడు, మధుసూదన్ రాయల్, వివేకానంద, అప్పాజీ, శివ, మురుగేష్ హాజరయ్యారు.

అభివృద్ధికే పట్టం కట్టండి

పెనుమూరు(కార్వేటినగరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధికి పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను వందశాతం పూర్తిస్థాయిలో నెరవేర్చిన ఏకై క ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని, కుప్పంలో చంద్రబాబుకు ఓటమి తప్పదన్నారు.

మోసాల మేనిఫెస్టోను నమ్మకండి

చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటై మోసాల మేనిఫెస్టోతో ముందుకొస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మవద్దని ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి అన్నారు. మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటే నాకు ఓటు వేయండని చెబుతున్న దమ్మున్న ఏకైక నాయకుడు సీఎం జగనన్న మాత్రమేనని తెలిపారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ కుప్పంలో చంద్రబాబును ఓడించి వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేయడం ఖాయమన్నారు.

మేమంతా ఒక్కటే..

టీడీపీ, జనసేన, ఎల్లో మీడియాలు కలసి నారాయణస్వామి వర్గం, జ్ఞానేంద్రరెడ్డి వర్గం వేరువేరని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, మేమంతా జగనన్న వర్గమని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించే బాధ్యత తనదేనని రాష్ట్ర విదేశీ వ్యవహారాల సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి అన్నారు. అనంతరం సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి మాట్లాడారు.

మీకు ప్రజాబలం ఉంటే పొత్తులెందుకు ?

పలమనేరు/బైరెడ్డిపల్లి : మీకు ప్రజాబలం ఉంటే ఇన్ని పార్టీలతో పొత్తులెందుకని రాష్ట్ర విద్యుత్, సైన్స్ అండ్ టెక్నాలజీ, అటవీ, పర్యావరణశాఖ, భూగర్భగనుల శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన 3,972 మంది లబ్ధిదారులకు రూ.7.44 కోట్ల వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కును, 1,056 మందికి రూ.9.62 కోట్ల వైఎస్సార్ ఆసరా మెగా చెక్కులను ప్రజాప్రతినిధులతో కలసి పంపిణీ చేశారు. మండలంలో నిర్మించిన పలు నూతన రోడ్లను ప్రారంభించారు. ఆయ న మాట్లాడుతూ నిన్నటి దాకా మోదీని విమర్శించి, దూషించిన చంద్రబాబు మళ్లీ ఎన్నికల కోసం సాగిలపడి బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని తెలిపారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాజంపేట పరిశీలకులు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు రూప, నారాయణస్వామి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కనకదాస, రాయన్న విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండల కేంద్రం రామకుప్పం–బందార్లపల్లి సర్కిల్‌లో ఆదివారం కురుబ కురుస్తుల ఆరాధ్యుడు భక్త కనకదాస, స్వాతంత్ర్య సమరయోధుడు క్రాంతి వీర సంగోలి రాయన్న విగ్రహాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. మంగళవాయిద్యాల నడుమ మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎంపీపీ, కురుబ సంఘం నేత ఆరేళ్ల జయప్పతో కలిసి విగ్రహావిష్కరణ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీలు సుబ్రమణ్యం, రెడ్డెప్ప, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు ఆరేళ్ల జయప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడు, ఎంపీటీసీ చలపతి, కో–కన్వీనర్ చంద్రారెడ్డి, నేతలు మోహన్, సంపంగి, ఆనంద్, రమేష్, కుందనందన రెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రా, గంగాధరం పాల్గొన్నారు.

అడిషనల్ పోలింగ్ కేంద్రాలకు కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా అడిషనల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు కలెక్టరేట్ అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల కోరిక మేరకు జిల్లావ్యాప్తంగా తొమ్మిది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 1450 మంది ఓటర్లకంటే ఎక్కువ ఉన్న పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో అడిషనల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకు గుర్తించిన తొమ్మిది అడిషనల్ పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. పుంగనూరులో 3, నగరిలో 2, జీడీ నెల్లూరులో 1, పూతలపట్టులో 2, పలమనేరులో 1 అడిషనల్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో నివేదికలు సిద్ధం చేసి వాటిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆమోదం కోసం పంపనున్నారు.

నేడు స్పందన రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 11వ తేదీన రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనివార్య కారణాలతో స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

నేడు పోలీసు కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ పి.జాషువా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని ఆయన అందులో పేర్కొన్నారు.

ఏనుగుల కట్టడికి చర్యలు

చిత్తూరు కార్పొరేషన్: ఐరాల సెక్షన్ పరిధిలోని చుక్కావారిపల్లెలో ఉన్న ఏనుగుల గుంపును కట్టడి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు డీఎఫ్‌ఓ చైతన్యకుమార్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. అవి ఎక్కువగా పుంగనూరు, పలమనేరు, చిత్తూరు ఈస్ట్ నుంచి తిరుపతికి వెళ్లి చుక్కావారిపల్లె అటవీ ప్రాంతం వైపు తిరిగి వచ్చిందన్నారు. రాత్రుల్లో అటవీ ప్రాంతానికి వెళ్లి ఉదయం పంటల వైపు వస్తోందన్నారు. అందులో కొన్ని పిల్లలు కనబడడతో ఈ ప్రాంతం వదలి వెళ్లడం లేదన్నారు. వాటి కట్టడికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవి వస్తే టపాసులు పెట్టడం, అగ్ని చూపించడం వంటి చేయాలని వివరించారు.

ముక్కంటి మురిసె.. అమ్మణ్ణి మెరిసె!



కల్యాణ మండపానికి వేంచేస్తున్న శివపార్వతులు



కాణిపాకం సారె సమర్పిస్తున్న చైర్మన్, ఈఓ

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ క్రమంలో పట్టణ నడిబొడ్డులోని పెండ్లి మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. విశేష రంగువల్లులతో వీధులను అలంకరించారు. వివాహ ఘట్టంలో భాగంగా ముక్కంటి ఆలయంలో నూతన వధూవరులను ముస్తాబు చేశారు. ప్రధానార్చకులు యాగశాల వద్ద స్వామి, అమ్మవార్ల బుగ్గలపై చుక్కలు పెట్టి కల్యాణ వేదికకు ఊరేగింపుగా సాగనంపారు. కళాబృందాలు, మంగళవాయిద్యాల నడుమ గజ వాహనంపై స్వామి, సింహవాహనంపై అమ్మవారు అధిష్టించి కనులపండువగా అలంకరించిన మాడవీధుల్లో విహరిస్తూ పెండ్లి మండపానికి వేంచేపు చేశారు. ఆదిదంపతులు కల్యాణోత్సవ ఘట్టం వీక్షించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేశారు.

వైభవంగా నందివాహన సేవ

కల్యాణోత్సవం సందర్భంగా వాయులింగేశ్వరుడు ఆదివారం ఉదయం అధికార నందిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అమ్మవారు కామధేనువుపై దర్శనమిచ్చారు. చతుర్మాడ వీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లకు పురజనులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ సారె సమర్పణ

విజయవాడ కనక దుర్గమ్మ ఆలయం తరపున ఈఓ రామారావు, పాలక మండలి చైర్మన్ సారె సమర్పించారు. ముక్కంటి ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు స్వీకరించారు.

శివయ్యకు శ్రీవారి సారె

తిరుమల శ్రీవారి తరపున శ్రీకాళహస్తీశ్వరునికి టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి సారె సమర్పించారు. పట్టణంలోని దేవాంగుల మండపం వద్ద ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు ఘనంగా స్వాగతం పలికారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తలపాగా ధరించి సారె తీసుకుని ముక్కంటి ఆలయంలో సమర్పించారు. ఈ క్రమంలోనే శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయం తరపున ఈఓ పట్టువస్త్రాలు సమర్పించారు.

వరసిద్ధుని పట్టువస్త్రాలు

కాణిపాకం ఆలయం తరపున ముక్కంటికి పట్టువస్త్రాలను పాలక మండలి చైర్మన్ మోహన్‌రెడ్డి దంపతులు, ఈఓ రాణాప్రతాప్ దంపతులు సమర్పించారు.

భక్తులతో బోయకొండ కిటకిట



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, జంతు బలులు ఇచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయంలో భక్తుల రద్దీతో క్యూలైన్లన్నీ నిండాయి. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.


దుమ్ములేపిన జల్లికట్టు



దూసుకుపోతున్న కోడెగిత్తలు

వెదురుకుప్పం: మండలంలోని కొమరగుంట గ్రామంలో ఆదివారం జల్లికట్టు ఉల్లాసంగా సాగింది. జనప్రవాహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోతున్న ఎడ్లను యువత అడ్డుకునేందుకు యత్నించారు. ప్రేక్షకుల అరుపులు, కేకలతో జల్లికట్టు దుమ్మురేపింది. ముందుగా ఎడ్ల కొమ్ములకు బెలూన్లు, పలకలు కట్టి బహుమతులతో సిద్ధం చేశారు. అప్పటికే యువత పెద్దఎత్తున గ్రామానికి చేరుకుని అల్లి వద్ద నిలబడ్డారు. అనంతరం ఎడ్లను పందేనికి ఉసిగొల్పగా కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జన ప్రవాహాన్ని చీల్చుకుంటూ పరుగులు తీశాయి. దూసుకుపోతున్న ఎడ్లను నిలువరించి యువత పలకలను లాక్కుని ఆనందంతో మునిగితేలారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రావడంతో కొమరగుంట జనాలతో కిక్కిరిసింది.

గంగమ్మ ఆలయంలో చోరీ



చౌడేపల్లె: మండలంలోని పరికిదొన పంచాయతీ మొరుంకిందపల్లెలో వెలసిన గ్రామదేవత శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆదివారం ఉదయం పూజలు చేసేందుకు వెళ్లిన మహిళలు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి గ్రామస్తులకు తెలిపారు. ఆలయ తాళాలు ధ్వంసం చేసి అమ్మవారి మెడలోని బంగారు నగలతోపాటు హుండీ కానుకలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

35 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



తెలుగుదేశం నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంసీ విజయానందరెడ్డి

గుడిపాల: చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో 35 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. చిత్తూరు మండల జెడ్పీటీసీ అభ్యర్థి బాబునాయుడు ఆధ్వర్యంలో కమ్మతిమ్మాయపల్లెకు చెందిన తెలుగుదేశం నాయకులు బలరామ్, దిలీప్, బలరామ్ ఆధ్వర్యంలో 35 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి విజయానందరెడ్డి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూబకాసురులు అంతా తెలుగుదేశం పార్టీలో చేరి వైఎస్సార్‌సీపీని ఓడించాలని కుటిలయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు తమ ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి వారికి తగిన సమాధానం చెప్పాలని కోరారు.

సింగారిపేటను అభివృద్ధి చేస్తా..

గుడిపాల మండలంలోని సింగారిపేట గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం సింగారిపేట గ్రామంలో గ్రామస్తులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగనన్న చేసిన మంచిని గుర్తు చేసుకుని వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, నాయకులు మధుసూదన్‌రాయల్, రజినీకాంత్, మధుసూదన్ రెడ్డి, లడ్డురెడ్డి, మణి, మొగిలిరెడ్డి, సంపూర్ణ, చిట్టిబాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భావి శాస్త్రవేత్తల వేదిక ఇన్‌స్పైర్ మనాక్



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ

చిత్తూరు కలెక్టరేట్/ గంగవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏటా ఇన్‌స్పైర్ మనాక్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నాయి. విద్యార్థుల్లో శాస్త్ర పరిశోధనలపై ఆసక్తి పెంచేందుకు 2010లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టగా, దీన్ని మరింత విస్తరించి 2012–13 నుంచి ఇన్‌స్పైర్ మనాక్‌గా అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తొలుత జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతాయి. అక్కడ ఉత్తమంగా ఎంపికయ్యే ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి, అక్కడ ఎంపికైతే ప్రాంతీయ, ఆ తర్వాత జాతీయ స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులకు ప్రభుత్వమే పేటెంట్ హక్కులు ఇస్తుంది. అంతేకాకుండా రాష్ట్రపతి భవన్, జపాన్ దేశం సందర్శనకు అవకాశం కల్పిస్తారు.

తొలిసారి జిల్లాలో రాష్ట్రస్థాయి కార్యక్రమం..

ఇన్‌స్పైర్ మనాక్ రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని తొలిసారిగా జిల్లాలోని గంగవరం మండలం మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహణకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం నిర్వహణకు జిల్లాస్థాయిలో 26 టీచర్ల కమిటీలను ఏర్పాటు చేశారు. డీఈఓ దేవరాజు, డీవైఈఓ చంద్రశేఖర్, జిల్లా సైన్స్ అధికారి వెంకటరమణ, తదితరులు ఆదివారం కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.